# కొడుకులు - కొత్త బట్టలు

కొడుకునిగన్న ఏ అమ్మకేనా ఉండే కోరికే అది - కోడలు సెయ్యెట్టుకుని కొడుకు కొత్త బట్టల్లో కులుకుతూ కనిపించాలని అనీ, ఆడి సంబరంలో సాబాలు తానుకూడా పంచుకోవాలనీను. అదేమరిడమ్మకీఉంది. అయితే ఆ ఉండడంలో ఓ పిసరు ఎక్కువుంది. అంతే - మరిఉండదూ?

రావుడు తనకి ఒక్కగానొక్క నలుసు. ఆడెప్పుడు పెద్దోడవుతాడా, ఆడికి తన తమ్ముడి కూంతురు సింహాచలాన్నిచ్చి అప్పన్న గుడిలో ఎప్పుడు ఆ ముచ్చట కాసింత తీరుద్దావా అని ఎదురు తెన్నులు సూత్తోంది. పంచెకట్టు బిగించి నల్ల నల్లగా మారుతూన్న నూగుమీసం మీద సెయ్యేసి, జతగాళ్ళతో పందేలేసుకొని, సైకిలురికసాతొక్కుతూన్న రావుడిని సూసినప్పుడల్లా మరిడమ్మకి సింహాచలమే మనసులో మెదిలేది. ఎప్పుడేనా దాని ఊసుఎత్తితే ఆడుకస్సుమనేవోడు. ఆడుఅల్లా అన్నప్పుడల్లా "అవును. సిగ్గుకదూమరి!" అంటూ తనలో తనే నవ్వుకొనేది.

అలాకొడుకూ, కోడలూ, కొత్తబట్టలూ-ఈటిగురించే, రావుడుట్టినకాడనించే కమ్మగా కలలుగంటూన్న మరిడమ్మకి మతేపోయింది. ఆ సందేవేళ ఎవరో కొత్తపిల్లని రికసాలో కూసోబెట్టి రయ్‌మంటూ తొక్కుకొచ్చి 'ఇది నా పెళ్ళాం' అంటూ రావుడు తనకి సూపించి నవ్వుతు ఎటకారం ఆడుతున్నాడనుకుంది మొదట్లో-నిజంగా పెళ్ళాడేశాడా? తనకీ ఇంట్లోఉన్న ముసిలాడికీ సెప్పకుండానే! మరి సింహాచలం

మా ఉంగాను? - ఆఁ! ఇది నా పెళ్లాం అని మతిలేక ఆడంటే మాత్రం తను నమ్మడం ఏంటి? ఛట్ అనుకుంది. కాని కొత్త బట్టలూ బుగ్గనిసుక్కా కాళ్ళకి పసుపూ మెళ్ళో శతమానాలూను - తను నమ్మకపోతే మాత్రం ఏవయినట్లు? నెత్తీ నోరూ బాదుకొని ఏడుస్తూ పాకలోకి ఎల్లిపోయింది మరిడమ్మ. అత్తకాళ్ళకి దణ్ణం ఎడదాం అని ఒంగిన లచ్చి, తల ఎత్తి రావుడికేసి సూసింది. ఏం అర్థంకాక - రావుడు నవ్వి 'బయపడకు - నా ౖరోజుల్లో అదేసద్దుకు పోతాది' అన్నాడు.

........ ...

రికసాదిగి పాకలోకి అడుగెడుతూనే "ఓలమ్మో ఏడున్నా వే....లచ్చీ-నిన్నే" అంటూ అరిశాడు రావుడు. "ఈడున్నా మావా" అంటూ ఎదురెళ్ళింది లచ్చి. అదిసూసి ముసిలాడి నులకమంచాన ఉన్న కాళ్ళ కాటిదిక్కు బిగిస్తూన్న మరిడమ్మ మూతితిప్పుకుంటూ "మానట, మావ" అంది తనలో తను అనుకున్నాట్టుగా.

నవ్వుతూ "ఎందుకుమావా. రోజూ పువ్వులు?" అంది లచ్చి, మావసేతిలో పొట్లాము అందుకుంటూ.

"ఎందుకేంటే! నా సరదా నాది" అన్నాడు రావుడు.

మరిడమ్మ ఎటకారంగా "ఒరేరావుడూ! మీఅయ్యకి సుట్టముక్కలు మాట మరిసినా, పాపం పెళ్లానికి పువ్వులు తేవడం మాత్రం మరిసిపోవు" అంది.

"అయ్యకికూడా సుట్టలు తెచ్చా - అయినా దాని పువ్వులుఊసు నీ కెందుకే - నీకు కూడా కావోల్సిన వేమైనా ఉంటే సెప్పు - తెస్తా. అంతేగాని."

సుట్టలుసూసే తలికి ఇంత మొహం అయింది ముసిలాడికి - కొడుకుని ఎనకేసుకొస్తూ "ఆడినేం అనకే-ఆరావులోరటూ, మనరావు డిటూను" అన్నాడు.

"ఆఁ! అలాగే ఎనకేసుకురా-రోజూ అణాపువ్వులైతే నెలకి ఎంతపాటు అవుద్ది? అయినా - కాలంలో ఎప్పుడేనా నువ్వు తేవడంకాని నే నెట్టుకోవడంగాని ఎరుగుదువా?" అంది మరిడమ్మ.

"ఊరుకోవే - మనకాలం ఏరు?

"బాగా సెప్పావ్? ఇలా ఓ ముదనష్టపుదాన్ని తీసుకొచ్చేసి ఇది నా పెళ్ళాం అంటూ మనకాలంలో తైతె తెక్కలాడారా, కులంలో వోళ్ళచరేనా!"

"నోరు ముయ్యవే ముదనష్టపుదాన" అంటూండగా, దగ్గుతెరముంచుకొచ్చేసి పాకపైకప్పు ఎగిరిపోయేలా దగ్గుతూ గుండెలు రాసుకుంటూ కూసున్నాడు ముసిలాడు.

ఇదంతా సూస్తూ బిక్కచచ్చిపోయి నిలబడి ఉండిపోయింది లచ్చి. రావుడికి అమ్మమీద అయ్యమీద మా సెడ్డకోపం వొచ్చింది. దాన్ని లచ్చిమీన సూపిస్తూ "ఏటలా నిలబడి పోనావు బొమ్మలాట సూస్తున్నట్టు? రిక్సా బండి నాగడంతో వొళ్ళంతా కుళ్ళబొడిసినట్టయి పోనాది. లేసి కొంచెం ఉడుకునీళ్లెట్టు" అంటూ కయ్ మన్నాడు.

తనువణ్ణాం తింటుంటే దగ్గర కూసుని ఇసురుతూన్న లచ్చినిసూసి "ఎందుకే నే నంటే నీ కింత ప్రేమ? అన్నాడు రావుడు నవ్వుతూ." ఆవ్వేంమాటలు? పేమా నేది ఏంనేదు - ఊరకుండు" అంది లచ్చి సిగ్గుతో మొహాన్ని దించేసుకుంటూ.

"ఓలబ్బో! ఏం సిగ్గే! మ రిదంతా మీా వోళ్ళనందర్నీ వొది లేసి గుళ్ళో నన్ను పెళ్ళాడంకోసం లేసి, వొచ్చేసి నప్పు డేవైందో!" అన్నాడు రావుడు.

"ఫో మాావా ఎరాసికాలూ నువ్వూనూ" అంటూ లచ్చి సేతిలోఉన్న ఇసినికర్రతో రావుడి ఊపుమీాద ఓ టేసింది.

"ఓలమ్మో!నూడునాయీాల నన్నుకొడతంది" అంటూ అరవబోయాడు రావుడు. కంగారుగా లచ్చి రావుడు నోరు మూసింది. ఎంటనే వోటంగా దగ్గిర కొచ్చిన లచ్చినడ్డి మీాన సెయ్యేసి వా టేసుకున్నాడు రావుడు...............

"రేపటినుంచి అత్తనాగ నేనూ కూరగాయలమ్మ టానికి పోతూఉంటా" అంది లచ్చి.

రావుడు బిత్తరపోయి "ఏటీ? కూరగాయులమ్ముతావ్? ఏం? ఏవొచ్చిందని?" అన్నాడు.

"అదేం కానిపనేటి మావా!"

"కానిపనో కాదో-అసలెందుకూ అని"

"ఎందుకేటి? ఓ పావలాడబ్బులొస్తే నీకు కూసింత సాయం అవుద్దిగందా"

"అవుసుగానీ ఇదినీకేతోసిందా, వోరేనా సెప్పారా?"

"వోరూ సెప్పలేదు. నేనే అనుకున్నాను నా గుడ్డ ముక్కల మట్టుకేనా రాదా అని"

"అద్దదీ! లలా సెప్పు-నిన్న నీ కోసం ఆ సింత పువ్వుల రైక తెచ్చానని అమ్మేదో కజ్జాఎట్టి ఉంటుంది. దాంతో పౌరాసంవొచ్చి ఇట్టాగంటున్నావు. అవునా?" అన్నాడు

రావుడు లచ్చినెత్తి మీద సెయ్యేసి నివురుతూ-లచ్చి ఏవీ సెప్పకుండా ఊరుకుంది.

"తలమీద బొప్పికట్టిందేవిటి?" అన్నాడు రావుడు కంగారుపడుతూ-ఆడిసెయ్యి ఎంటనే తోసేస్తూ "ఏవీనేదు మావా-నీకుపెతీదీ కావాలి" అంటూ ఇసుక్కుంది లచ్చి

"అలా తోసేస్తావేటీ? ఉండు నూడనీ అసలెందుకు బొప్పి కట్టిందోను" అంటూ రావు డింకా నిలదీస్తూంటే మరిడమ్మ అక్కడకొచ్చి "వోరేయ్! మీ అమ్మ దాని నెత్తి మీద సెంబుతో మొట్టిందిరా. సరా? సిగ్గులేనోడా! ఇంట్లో ఆడాళ్ళ గొడవలన్నీ నీకే కావాలి" అంది.

దాంతో రావుడికి అంతా ఎరికయింది. తలొంచుకొని నిలబడ్డ లచ్చికేసీ, దాని ఏపు రుసరుసలాడుతూ సూత్తూ ఉన్న అమ్మకేసీకొంచెంసేపునూసి ఒకసారి తలఊపి "ఇయ్యాల నుంచి రేతిరికూడా అద్దెకుచ్చుకుని రికసాబండి నాగుతా అన్నాడు. లచ్చి అదిరిపడి తలఎత్తి నూసింది. 'పగలల్లా పడేది సాలక, రేత్తిళ్ళుకూడా ఎందుకురా పాటు?' అంది మరిడమ్మ. ఇదేం ఇనిపించుకోకుండా రివ్వున ఎల్లి, రికసాఎక్కి-రయ్‌మంటూ సీకటిలోకి మలుపు తిప్పేసినాడు. "సింపిరికళ్ళ ముదనష్టపుదానా, సూడు నీ మూలాన్ని బిడ్డ ఎంత కష్ట పడుతున్నాడో!" అంటూ బాధ ఆగక, బొప్పికట్టిన ఆ తల మీదే మరో మొట్టికాయ అంటించి ఎల్లిపోయింది మరిడమ్మ. మండుతూన్న తలను నివురుకుంటూ "ఏమైనా అత్త మంచిదే! రేత్తిళ్ళు ఎల్లొద్దంటోంది మావని" అనుకుంది సాలా సేపటిదాకా అలా నిలబడి ఉండిపోయి లచ్చి...

మద్దేల పన్నెండింటికి కూసే మిల్లుకూత ఇనేతలికి సటుక్కున మెలకువ వచ్చింది లచ్చికి. అమ్మో! మిల్లు కూసేసింది. కూర లమ్మకం అయిపోయి ఇంక అత్త వొచ్చేస్తాది. రికసా మువ్వలు సప్పుడు సేసుకుంటూ మావకూడా వచ్చేస్తాడు. ఇప్పటికింకా పొయ్యిమీదకి కుండ ఎక్కించనేదు. పంపునీళ్ళుకూడా తేనేదు. ఏటి దారి? అత్త వొచ్చి ఏం కేకలేస్తదో ఏమో!

లచ్చికి బయంవేసి ఒళ్ళంతా ఒణికిపోనాది. నింపాదిగా నులక మంచం మీంచి నేవబోయింది. ఇంకా నీరసంగానే ఉంది. కళ్ళు తిరుగుతూనే ఉన్నాయి. మళ్ళీ వొంతి వొచ్చేనాగుంది. అయినా పాక నిట్రాడ సాయం సేసుకొని లేవబోయింది. కాని సుట్టూ ఏదో పచ్చగా గుండ్రంగా తిరిగిపోయినట్టయి దభీమని మంచంమీద పడిపోనాది.

నుసి ఎనక కాస్త నుప్పైనా ఉండదా అనే ఆశతో సుట్ట కాలుసుకోడం కోసం ఉత్తిపొయ్యిని ఊఁ! ఊదుతున్న ముసిలాడు సప్పుడు ఇని, సటుక్కున ఎనక్కి తిరిగి సూసాడు. సూస్తానే "ఒంతులయి ఆ మట్టున ఉన్నావుగందా? లెగడం ఎందుకు? పడుకోనేవూ?" అంటూ కూకలేసాడు.

"మరి – అత్తొచ్చేతలికి ఒంట సెయ్యొద్దూ" అంది బయంగా ఉన్న నీరసంతో.

"ఎర్రిమొగమా? అలా ఉండి ఒంటేం సేస్తావ్? అది వచ్చి సూసుకుంటదిలే – నువ్వడుకో!" అన్నాడు ముసిలాడు.

మావయ్య మాటలు ఇంటే లచ్చికి కళ్లు సెమ్మ

గిల్లాయి. మాావయ్య ఎంత మంచోడు! అత్తనాగ కాదు. మంచినీళ్ళకని పంపుకెళ్ళి ఒరసలో నిలబడి నీళ్ళు తేడం ఓ అడుగు ఎనకయితే, తాడిఎత్తున లేసి "ఇంతసేపూ ఎవడి తోటి సరసా లాడుతన్నావే" అంటూ శానా సెడ్డ మాట లన్నీ అనే స్తది - తనకి ఏడుపొచ్చి ఏం అనలేదు.

లచ్చికి సట్టున గేపకం వొచ్చింది. దాంతో మంచం మీాంచి లెగుస్తూ "ఇంక పంపు కట్టేత్తారు. ఇంటో ఒక్క-సుక్క-యినా నీళ్ళు నేవు" అంది.

"నీళ్లు నేపోతే నే పోతాలే పంపుకి. నువ్వు మాాత్రం నెగొద్దు" అంటూ లచ్చి ఎంత సెప్పుతున్నా ఇనిపించు కోకుండా కడవ తీసుకొని తడిక తలుపు దగ్గిరగా ఏసి దగ్గు కుంటూ ఎల్లిపోయాడు ముసిలాడు

మాావయ్య మంచి తనానికి మనసులోనే దణ్ణాం ఎట్టు కుంది లచ్చి. నీళ్ళకి తను ఎల్లాడు. పొద్దుట ఇకారంగా ఉండి వోంతులయి నీరసం వొస్తే, తను లేసి ఆ మంచం ఇచ్చి అంది మీాదడుకోమన్నాడు. ఒళ్ళు ఎరక్క- తను పడుకుంటే కంగారుపడి పక్కింటి ఈరమ్మత్తని పిలుసుకొచ్చాడు. అది మడిసిని ఎగాదిగా సూసి పొట్టమీాద సెయ్యేసి పకపకా నవ్వుతూ "బావయ్యాయ్! ఏం లేదయ్యా. నువ్వు తాత వవుతావు. అంతే - అవునుగాని అదేటి లమ్మో ముసలాడిని అలా కంగారు పెట్టేసినావు" అంటూ ఎల్లిపోయాకగాని మాావయ్య మనస్సు కుదుటబడ నేదు.

మాావయ్య ఎంత మంచోడు!

కాని ఈరమ్మత్త ఆ మాట సెప్పినకాడనుండీ తనకి

సిగ్గుతో పానం సచ్చిపోనాది. ఆ ఊసు పైరుగాలిలా సల్లగా గుండెల్లోకి దూరి ఉండుండి తనకి కితకితలు పెడుతోంది. ఇది మావకి తెలిస్తే ఎంత సంబరపడతాడో! కాని ఎలా సెప్పడం బాబూ! లచ్చికి సిగ్గేసి రెండు సేతుల్తోనూ మొగం కప్పెసుకుంది.

ముసలాడడుకునే నులకమంచం మీదడుకొని కళ్ళు మూసుకుని కులుకుతూన్న కోడలిని సూసేతలికి మరిడమ్మకి వొళ్ళు సిరసిరలాడింది. "కళ్ళు మూసుకు పోనాయ టే! అది ముసలాడడుకునే మంచం కనిపించడం లేదూ" అంటూ ఓ కేకెట్టింది. పాక మూలని ఖాళీ కూరలగంప పడేస్తూ బోర్లించిన కుండల్నీ సప్పగా సల్లావిఉన్న పొయ్యినీ సూసి శివం ఎత్తినట్టు లచ్చి దగ్గరకెళ్ళి "కూడు ఒండకుండా తొంగున్నావు. నీ బాబు ఎవఁడొచ్చి ఒండుతాడే!" అంటూ గయ్యి మంది.

అప్పుడే కడవలో సగానికి నీళ్ళట్టుకొని లోపల కొస్తూన్న ముసిలాడు "ఏటే దానిమీద ఇరుసుకు పడుతున్నావ్! దానికి ఒల్లు బాగానేదు" అన్నాడు. ఇంటో కోడలుండగా తన మగాడు కడవ ఎత్తుకురావడం సూసేతలికి మరిడమ్మకి మరి కోపం ఆగనేదు.

ముసిలాడు అంటున్న దేవీ ఇనిపించుకోకుండానే, లచ్చిని జుట్టట్టుకొని లేవదీసింది కళ్ళల్లో నిప్పులు కక్కుతూ. అది సూసి అప్పుడే లోపలికి ఒస్తూన్న రావుడు తెల్లబోయి నోట మాట రాకుండా అట్టే ఉండిపోనాడు. ముసిలాడు కంగారుగా కడవ దింపి "ఒసే దానిమీద సెయ్యి సేసుకోకు.

అది ఇప్పుడు త్తిమనిషికూడా కాదు. మనకి మనవ డుడతాడంట. ఈరమ్మ సెప్పింది" అనో మూాల అంటూాండగానే తన బలంకొద్దీ మరిడమ్మ లచ్చిని, ఆ లెంపా ఈ లెంపా వాయించెయ్యడమూ, అది కళ్ళు తేలేసి ఒళ్లు తెలియకుండా కిందడిపోవడమూ జరిగిపోనాయి.

అయ్యనౌతున్నా సన్న సంబరం వొచ్చినంతసేపు పట్టనేదు రావుడికి. మెరుపు మెరిసి సీకటయి నట్టయింది. లచ్చి సప్పగా కిందకి ఒరిగిపోవడం సూసే తలికి ఆడికి కళ్ళు బైర్లు గమ్మాయి. కోపంతో ఒళ్ళుఊగిపోనాది. "నాలచ్చిని సంపే శావు గదటే!" అంటూ అరిసి, ఒక్క పరుగులో లచ్చి దగ్గర కెళ్లాడు. దాని తలని తన తొడమీద ఎట్టుకుని, మొహం మీదదుతున్న జుట్టుని ఎనక్కితోస్తూ "లచ్చీ-నాలచ్చీ" అంటూ ఏడవసాగాడు.

కోడలలా పడిపోవడాన్నీ కొడుకు ఏడుపునీసూసి, పేనం ఉండబట్టలేక సెయ్యెత్తుకుని "ఎంతపని సేశావే ముదనష్టపు దానా" అంటూ మరిడమ్మ మీదకి ఎల్లాడు ముసిలాడు. తను ఏంసేసిందో తెలుసుకునే తలికి మరిడమ్మకి బయం ఏసింది. గుండెలు ఏకకొట్టుకొని బిత్తరసూపులు సూత్తోంది. అలాంటిది ముసిలాడు తనమీద మీదకి రావడంసూసి, లేని బింకాన్ని తెచ్చుకుని "ఏం? కొడతావా?" అంది.

"కొట్టడవేశాడు. లచ్చి లేవకపోతే నీ పేనాలే పుచ్చుకుంటా" కళ్ళల్లో సింత నిప్పులు కురిపిస్తూ అన్నాడు ముసిలాడు.

లచ్చి మొహంమీద మొహంపెట్టి రావుడింకా ఏడుస్తూనే అన్నాడు.

సటుక్కున గేపకంవొచ్చి, ముసిలాడెళ్ళి కడవలోంచి దోసిడు సన్నీళ్ళట్టుకొచ్చి, లచ్చి మొహంమీద సిలకరించాడు. ఇలా రెండు మూడు తేపలు సేసేతలకి, లచ్చి కొంచెంగా కదిలి నీరసంగా కళ్ళు తెరిసింది. పేనాలు కుదుట బడి రావుడు 'హమ్మయ్య' అని గట్టిగా ఊపిరి పీలుసుకున్నాడు. ముసిలాడి గుండె తేలికడింది. ఏం కొంపమునుగుతుందో అని అప్పటిదాకా బితుకూ, బితుకూ మంటూన్న మరిడమ్మ "హాసి! ఎంతనాటకం ఆడావే. పేనాలు పోయినట్టు!" అంది. సట్టున ముసిలాడు మరిడమ్మకేసి కోపంగా సూశాడు.

రావుడికి వొల్లమాలినంత కోపం వొచ్చేసింది. లచ్చి తలని తొడమీంచి నిమ్మదిగా తప్పించి, ఈరబద్రుడిలా లేసి నిలబడ్డాడు. కళ్లు సింతనిప్పుల్లా కణకణలాడి పోతన్నాయి. ఒళ్ళంతా ఊగిపోతన్నాది.

ఆడికి అంతకోపం రావడం ఎప్పుడూ సూడనేదేమో ముసిలాడు గజగజలాడి పోనాడు." ఏంఓగాయిత్తం సేత్తాడో అని అడిలిపోయి 'రావుడూ!' అంటూ ఓ ఎర్రికేకెట్టింది మరిడమ్మ. రావుడు కోపంగా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఎక్కడికో ఎల్లిపోయాడు.

మళ్ళీ ఆడు తిరిగొచ్చేదాకా పేనాలుపోయి నోళ్ళలాగ, కదలకుండా ఆమట్టునే కూసుండి ఉండిపోయారు ముసిలాడూ మరిడమ్మానూ. రావుడు ఆళ్ళదిక్కేనా సూడకుండా, ఆ

రావడంరావడం తిన్నగాలచ్చి దగ్గిరికేబచ్చి, 'రాలచ్చీపోదాం' అన్నాడు.

నీరసంగా ఉన్నకళ్ళుపైకెత్తి "ఎక్కడికీ" అని అడిగింది తెల్లబోతూ లచ్చి.

"ఈ ఇంటో నువ్వు బతకవు. మనం వేరే ఉందాం అందకా ఓ పాక సూసొచ్చా - దా అందులోకి పోదాం? అన్నాడు రావుడు. ముసిలాడూ మరిడమ్మ అదిరిపడ్డారు. ఒక్కగానొక్క కొడుకు, ఏరింటి కాపరం ఎడతాడా? ఇయ్యాలనుంచి ఆడోసోటా మనమోసోటానా? ఇద్దరికీ మతి పోనాది.

అత్తనీ మావయ్యనీ ఒదిలి ఏరింటి కాపరానికిరానంది. ఇక్కడ తనకి బాగానేఉంది అంది. ఉమ్మడి అన్నాక, ఏవో సిన్నసిన్నకలతలు రాకమానవు ఆవేసరుదుకుపోతాయి. అంత మాత్రంసేత ఇడిపోతామా అంది. వొద్దంది. బతిమాలుకుంది. ఏడిసింది."

ఇలా ఏంసేసినా ఎంతసెప్పినా లచ్చిమాట ఇని పించుకోలేదు రావుడు. సెయ్యిసాయంసేసి నడిపించుకుంటూ లచ్చిని తీసుకుపోతన్నాడు. ముసిలాడూ మరిడమ్మా గుడ్లప్ప గించి సూత్తూనిలబడ్డారు. "నాకువెళ్ళడం ఇష్టంలేదసి" అత్తతో ఏడుస్తూ సెప్పింది లచ్చి. "నంగనాచి కబుర్లు సెప్పకే - నాకు తెల్దేటి ఇడిపోయి ఏరుందాం అని నువ్వే ఆడికి నూరిపోశా వని. ఓలబ్బో ఈ నాటకాల కేంలే!" అన్నట్లు సూసింది. మరి డమ్మ.

లచ్చి తనకి దణ్ణం ఎడుతూఉంటే ముసిలాడికి కళ్ళు

సెమ్మగిల్లాయి. నోరు తెరసి అన్నాడు. "ఒరేరావుడూ అదేదో సేసిందని ఏ కేవెల్లి పోతావట్రా ఈముసిలాడి మొహంసూసేనా ఉండరా" అని—

"నీకు తెల్దులయ్యా! ఇద్దరాడోళ్ళు ఓ సోటవుంటే ఇది ఇంక ఇంతే! నా ఆలోసనకి తిరుగులేదు - నువ్వుకూడా పోనీ వొచ్చెయ్‌మాతో" అన్నాడు రావుడు.

"సూశావా నీ మూలాని ఎంతదాకా వొచ్చిందో" అన్నట్టు కొర కొరా సూశాడు ముసిలాడు మరిడమ్మ కేసి.

మరిడమ్మ నేలవేపు సూస్తూ ఉండిపోనాది

రావుడూ లచ్చీ గడపదా టేసారు.

"దేవుడా! ఈ ఏలప్పుడు ఎండలో కొడుకూ కోడలూ ఇల్లిడిసి పోతుండారు. ముందు ముందు ఏ సెడ్డా జరక్కుండా సూడు" అని ఎంకన్న బాబుకి దణ్ణం ఎట్టుకొని ఉస్సురంటూ వొచ్చి మంచంమీద వోలిపోయాడు ముసిలాడు. పాకమీద ఆకు లెగిరిపోయే నాగ కేకలేస్తూ, మద్దె మద్దెన లచ్చిని తిట్టి పోస్తూ పొయ్యిరాజెయ్యడం మొదలెట్టింది మరిడమ్మ.....

రోజూ కొడుకునీ కోడల్నీ సూడ్డానికెళతాడు ముసిలాడు. సీకటడే తలికి రావుడుకూడా వొచ్చాక ముగ్గురూ ఊసూపలుకూ కూసింతసేపు ఆడుకుంటారు. అప్పుడు అయ్యకి సుటలిచ్చి, ఆపైన ఓ పావలో అరదో సేతిలోపెట్టి, రికసాలో తీసికెళ్ళి రావుడు దిగబెడతాడు. లోపలికి రమ్మని అయ్యఎంత సెప్పినా ఇనిపించుకోకుండా ఆడనుంచి అలాగే ఎనక్కి తిరుగుతాడు. కొడుకుని సూడాలని అనిపించి నప్పుడు

మాత్రం ఇవతలకివొచ్చి "బాగున్నావురా రావుడూ!" అంటూ మరిడమ్మ పలకరిస్తుంది. కాని రావుడు 'ఊ', అనడు 'ఆ' అనడు – అమ్మ మానఇనన్టే పోతాడు – తను ఎల్లా ఉన్నాడో అడుగుతుంది కాని కోడలు ఎలా ఉంది అని ఒక్క-పాలైనా అనదే అని రావుడికోపం–'అమ్మా నువ్వోపావిరా' అని ఆడు అనడే అని మరిడమ్మకి పుస్సు–

ఆళ్ళిద్దరూ సిలకా గోరింకల్లాగ ఉంటున్నారనీ, ఏరోజూ లచ్చికి పువ్వులు తేకుండా ఆడు మానడనీ, నీరసంగా ఉందని దానిని వొంటకూడా సెయ్యనియ్యకుండా రికసాతొక్కుకుని వొచ్చేటప్పుడు, టేసన్లో పెరుగన్నం సాంబారు అన్నం పొట్లాలట్టుకొస్తాడనీ, నెలలయి రోజురోజుకీ కోడలు నేవనేక పోతోందనీ, రేపోమాపో తాము తాతా అవ్వా ఔతున్నామనీ– ఇలారోజూ అక్కడి ఊసులన్నీ ముసిలాడు చెబుతూ ఉంటే, తిక్కలేనప్పుడు సక్కగా ఇంటుంది మరిడమ్మ–సిరాకేసినప్పుడు మాత్రం "నా కాళ్ళ గొడవ సెప్పకు" అంటూ సీదరించుకొంటుంది.

ఓ రోజున కొడుకునీ కోడలినీ సూడ్డానికని ఎల్లి ఎంటనే దగ్గుకుంటూ, ఒగురుసుకుంటూ ఎనక్కొచ్చి "వొసే! మన లచ్చి పురుడు రాక శానా బాద పడితే, దాన్ని రావుడు ఆసుపత్రికి తీసుకెళ్ళాట్ట" అన్నాడు. అది యిని మరిడమ్మ "ఆఁ!" అని అరిసి సేతిలో వున్న కుండని ఆమట్టునే వొదిలేసింది.

"దాని కెలా గుందో! – ఆడు పాపం ఏం కంగారు పడుతున్నాడో ఏమో – నెగు అసుపత్రి కెళదాం" అన్నాడు.

ముసిలాడు మూలనున్న కఱ్ఱ తీసుకుంటూ. పగిలిపోయిన కుండ పెంకుల్ని ఏరుతూన్న మరిడమ్మ "ను వ్వెళ్లితే ఎల్లు - నే రాను. ఏం అమ్మో, లచ్చికిలా కంగారుగా వుంది, రాయే అని ఆడుఅనకూడదూ? ఒచ్చి సెప్పడానికే ఆళ్ళకంత పొరోసం అయితే, పిలవకుండా ఎల్లడానికి నాకు మాత్రం పొరోసం వుండదూ?" అంది.

"కోడలు సావు బతుకులలో వున్నప్పుడుకూడా నీకు పట్టుదలేటే, ముదనష్టపుదానా" అంటూ ముసిలాడుతిడుతూ వుంటే బయటనుంచి పక్కింటి ఈరమ్మ "ఓ మరిడమ్మక్కో-! నీ కోడలు ఆసుపత్రిలో పోయిందట. రావుడక్కడ యేడుస్తా కూసున్నాట్ట!" అంటూ గట్టిగా ఓ కే కెట్టింది. అది యినే తలికి యిద్దరికీ గుండె లాగిపోయినాయి. నెత్తీ, నోరూ బాదుకుంటూ ఆసుపత్రికి పరిగెట్టారు.

"ఊఁ! చచ్చిని శవాన్ని తీసుకుపో! ఇంకా ఇక్కడుంచితే పెద్దడాట్టరువోల్లు మాకు మాటొస్తది...ఊఁ" అంటూ తొందరసేస్తున్న నర్సుల కేం చెప్పలేక, దిక్కుతోసక ఎక్కెక్కి ఏడుస్తా కూసున్న రావుణ్ని సూసి గుండె పగిలి "ఎంత పని జరిగిందిరో నాయనో" అంటూ వొచ్చి మరిడమ్మ కొడుకుని కౌగలించుకుంది.

"అమ్మో" అంటూ బావురు మన్నాడు రావుడు.

అదలించే అత్తకీ, మనసిచ్చే మావకీ యిద్దరికీకూడా అందకుండా తెల్లగా మంచులా మారిపోయిన లచ్చినిసూసి "లచ్చీ? నా తల్లీ!" అంటూ కూలబడిపోనాడు ముసిలాడు.

"అత్త రానేదా, అత్త రానేదా అంటూనే పేనం యిడిసిందమ్మా లచ్చి" అంటూ తలుసుకు తలుసుకు రావు డేడుస్తూంటే మరిడమ్మ కళ్లు వొత్తుకుంది.

ఆ సందేలేళకి గుడిసె దగ్గిర, లచ్చి శవంసుటూ కులం వోళ్ళంతా సేరారు. "లచ్చి నా కన్నేయం సేసింది. నా బతుకు తెల్లారిపోయిం" దని రావుడు యెక్కెక్కి యేడుస్తూంటే, కబురు తెలిసి పక్కవూరునుంచి వొచ్చి ఆపక్కనే నిలబడ్డ సింవాద్రిని సూపిస్తూ, "మొగాడివి అలా ఇదవకూడదు. పాపం అది సూడు నీ కేసి యెలా సూస్తోందో! ఆ సింవాద్రి మొగం సూసయినా దయిర్నం తెచ్చుకో. ఏం సేస్తాం! దానికి ఓగం లేదు. ఎల్లిపోయింది—అంతే" అంది మరిడమ్మ, ముసిలాడు లచ్చి శవంమీద కప్పుతూన్న కొత్త గుడ్డ సూసి, కోడలు సెయ్యెట్టుకుని కొడుకీ మాటు అయినా కొత్తబట్టల్లో తనకి నచ్చేలాగ కనిపిస్తాడనే కొండంత ఆశని గుండెల్లో దాసుకుంటూ.

సుట్టూ ముసురుకుంటూవున్న సీకట్లలో తెల్లనికొత్త గుడ్డల్లో మెరిసే లచ్చిని సూస్తూన్న రావుడికి అమ్మమీదా సింవాద్రిమీదా, ఆఖరికి తనమీదా, ఈ లోకంమీదా కూడా అసయ్యం యేసింది.

లచ్చిసుట్టూతావుండే గేపకాలు, కడుపులో దేవి, గుండెల్లో కరేలు మన్నట్టయి "అమ్మా!" అని మూలిగాడు రావుడు.